సాక్షి
ఖమ్మం
శనివారం । 31 । ఆగస్టు । 2024



నర్సరీ నారు.. బహుబాగు

మిర్చి సాగు చేసే రైతులు నర్సరీల్లో పెంచే నారుపై ఆసక్తి కనబరుస్తుండగా జిల్లాలో నర్సరీల సంఖ్య ఏటా పెరుగుతోంది. 8లో



.. తండ్రికి యావజ్జీవ శిక్ష

భార్యపై కక్ష పెంచుకుని ఇద్దరు పిల్లల గొంతు నులిమి హత్య చేసిన తండ్రికి యావజ్జీవ శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. 8లో

గరిష్టం / కనిష్టం
26° / 24°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

4న ఆన్‌లైన్ 'డాక్ అదాలత్'

ఖమ్మంగాంధీచౌక్: తపాలా శాఖ పరిధిలో వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు వచ్చేనెల 4న డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఖమ్మం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ వి.వీరభద్రస్వామి తెలిపారు. వినియోగదారులు తమ ఫిర్యాదులు, సమస్యలను సెప్టెంబర్ 2లోగా 'డాక్ అదాలత్, సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్, ఖమ్మం డివిజన్ – 507003' చిరునామాకు కవర్‌లో పంపించాలని సూచించారు. ఫిర్యాదుపై చిరునామా, ఫోన్ నంబర్, ఈ–మెయిల్ విధిగా అడ్రస్ రాయాలని పేర్కొన్నారు. అదాలత్ నిర్వహించే రోజున ఆన్‌లైన్‌లో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు. కాగా, సర్వీస్ అంశాలు, కోర్టుకు సంబంధించిన విషయాలు అదాలత్‌లో స్వీకరించబోమని వెల్లడించారు.

పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం

● జిల్లాపై అల్పపీడన ప్రభావం



ఖమ్మంవ్యవసాయం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కారణంగా జిల్లాలో శుక్రవారం సాయంత్రం నుంచి వర్షం కురుస్తోంది. పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులకు తోడు ఈదురుగాలులు వీస్తుండగా.. శని, ఆదివారాల్లో కూడా వర్షం కురిసే అవకాశముందని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని చెబుతుండగా.. జాబితాలో జిల్లా కూడా ఉంది. కాగా, శుక్రవారం రాత్రి 8 గంటల వరకు జిల్లాలోని కొణిజర్ల మండలం పెద్దగోపతిలో అత్యధికంగా 38.3 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. అలాగే, మధిరలో 29.3, రఘునాథపాలెంలో 28, ఖానాపురంలో 26.5, రావినూతలో 25.5, గౌరారంలో 22.5, కొణిజర్లలో 20.8, వేంసూరులో 20.5, ఎర్రుపాలెంలో 20.3 మి.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు. ఈ వర్షాలు వరినాట్లు జోరందుకోవడానికి దోహదం చేస్తాయని, మిరప సాగుకు సైతం ఉపకరిస్తాయని రైతులు చెబుతున్నారు.

నాలాలూ కబ్జా..

జిల్లాలో చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు మాత్రమే కాదు.. నాలాలపైనా ఆక్రమణదారుల కన్ను కూడా పడింది. దీంతో ఇప్పటికే పలు అలుగు వాగులు ఆనవాళ్లు కోల్పోయాయి. మరికొన్నింటికి ఇరువైపులా కట్టడాలు పూర్తయ్యాయి. దీంతో వరదనీరు చెరువుల్లోకి వచ్చే మార్గం లేక అవి కుంటలుగా మారుతున్నాయి. ఈ కారణంగా చెరువుల కబ్జాలు మరింత ఎక్కువయ్యే ప్రమాదం నెలకొంది. మరోవైపు గొలుసుకట్టు చెరువులకు కూడా నీరు వెళ్లే మార్గం లేక చిన్నపాటి వర్షం వచ్చినా ఒకే చెరువు వద్ద వరద పోటెత్తుతోంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



ఖమ్మం ఇందిరానగర్ సమీపాన లకారం చెరువులోకి వచ్చే నాలా కుచించుకుపోయిన దృశ్యం

- అలుగు వాగులకు తప్పని ఆక్రమణల బెడద
- కాల్వలను ఆనుకునే యథేచ్ఛగా నిర్మాణాలు
- ఫలితంగా చెరువులకు చేరని వరద నీరు
- చిన్న వర్షానికే గొలుసుకట్టు చెరువుల వద్ద వరద

ఆ నీరే చెరువులకు ఆధారం..

పూర్వకాలంలో ప్రజల తాగునీటి అవసరాలకే కాక సాగు అవసరాలకు చెరువులను తవ్వించారు. ఇందులో చాలా వరకు వర్షాధారంగానే నిండుతాయి. ఈమేరకు వర్షపు నీరు, వరద చెరువుల్లోకి చేరేలా కాల్వలు ఏర్పాటు చేశారు. తద్వారా ఎక్కడ వర్షం కురిసినా కాల్వల ద్వారా చెరువుల్లోకి నీరు చేరేది. అయితే, రానురాను కాల్వల చుట్టూ జనావాసాలు ఏర్పాటుకావడంతో కొన్నిచోట్ల ఇవి ఆక్రమణకు గురవుతున్నాయి. దీంతో చెరువుల్లోకి వచ్చే నీరు కూడా తగ్గుతోంది. ఫలితంగా చెరువులు ఏళ్ల తరబడి నిండకపోవడంతో కబ్జా కోరల్లో చిక్కుకుంటున్నాయి. కాల్వల నుంచి ప్రారంభమైన ఆక్రమణలు.. చెరువుల వద్ద ముగుస్తుండడంతో కొన్నాళ్లకు ఆనవాళ్లు కోల్పోయే పరిస్థితి నెలకొంది.

ఇదీ గోళ్లపాడు చరిత్ర

ఖమ్మం నగరం మీదుగా వెళ్లే గోళ్లపాడు చానల్ ద్వారా శివారు ప్రాంతాల్లోని పంట పొలాలకు నీరందేది. త్రీటౌన్ ప్రాంతంలో 10.6 కి.మీ. మేర ఈ కాల్వ ఉండగా.. కాలక్రమంలో ఇది డ్రెయినేజీగా మారిపోయింది. పంపింగ్‌వెల్ రోడ్డు, సుందరయ్యనగర్, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో ఈ కాల్వ ఇరువైపులా ఆక్రమణకు గురై తాత్కాలికంగా ఇళ్లు కూడా వెలిశాయి. ఈ పరిస్థితితో కాల్వ కుచించుకుపోయి సిల్ట్ తీయకపోవడంతో పెద్ద మురికి కూపమైంది. దీంతో 2018 నుంచి అప్పటి ప్రభుత్వం రూ.100 కోట్లు వెచ్చించి సుందరీకరణ పనులు చేపట్టింది. ఆక్రమణదారులకు పునరావాసం కల్పించింది. గోళ్లపాడు చానల్ పునరుజ్జీవం పొందినా.. జిల్లావ్యాప్తంగా ఇలా ఆనవాళ్లు కోల్పోయిన పంట కాల్వలు అనేకం ఉన్నాయి.

అలుగు వాగుల ఆక్రమణ

ఖమ్మం నగరాన్ని ఆనుకుని ఉన్న పలు చెరువులకు వచ్చే అలుగు కాల్వలకు ఇరువైపులా ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. బల్లేపల్లి, ఖానాపురం, లకారం గొలుసుకట్టు చెరువులుగా ఉండగా.. వీటి మధ్య వరద కాల్వల పరిమాణం తగ్గిపోయింది. కాల్వలను ఆనుకుని నిర్మాణాలు వెలిశాయి. ఖానాపురం, ప్రశాంతినగర్, చైతన్యనగర్, కవిరాజ్‌నగర్ ప్రాంతాల్లో అనేకంగా నిర్మాణాలు ఉన్నాయి. వరద ఎక్కువగా వచ్చిన సమయాన చెరువు అలుగు పడితే మరో చెరువులోకి వెళ్లేందుకు ఏర్పాటుచేసిన కాల్వలు కుచించడంతో ఒకే చోట నీరు పోటెత్తి లోతట్టు ప్రాంతాలకు చేరుతోంది.



ఖమ్మం ఖానాపురం సమీపంలో లకారం చెరువులోకి వచ్చే నాలా ఇరువైపులా ఇళ్లు

పంట కాల్వను ఆక్రమించారు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఖమ్మం మేజర్–1 పంట కాల్వ పరిధిలోని ఆయకట్టు మొత్తం ఇప్పుడు రియల్ ఎస్టేట్ వెంచర్‌గా మారింది. దీంతో పంట కాల్వను కూడా కొందరు ఆక్రమించారు. వెంచర్లు ఏర్పాటైన ప్రాంతంలో కాల్వ మీదే రోడ్లు వేశారు. మధురానగర్, వరదయ్యనగర్, గొల్లగూడెం తదితర ప్రాంతాల్లో కొంతభాగంలో పార్కులు సైతం ఏర్పాటయ్యాయి. ఇక్కడే కాక జిల్లావ్యాప్తంగా సాగు భూములు లేని ప్రాంతాల్లో ఉన్న కాల్వ లు, కాల్వకట్ట మిగులు భూములను పూర్తిగా ఆక్రమించారు. ఈ భూములను ఇటీవల వచ్చిన జీఓ లతో కొందరు క్రమబద్ధీకరించుకోవడం గమనార్హం.

సమన్వయంతోనే ఉత్సవాల విజయవంతం

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: వినాయక చవితి, గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని.. తద్వారా ఉత్సవాలు విజయవంతమవుతాయని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన స్తంభాద్రి ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ఎక్కువ మంది మట్టి ప్రతిమలను ప్రతిష్ఠించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే, మండపాల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని తెలిపారు. ఇక నిమజ్జన కేంద్రాల్లో ఏర్పాట్లపై అధికారులు ఇప్పటి నుంచే దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, అదనపు డీసీపీ ప్రసాదరావు, డీఆర్వో ఎం.రాజేశ్వరి, ఆర్డీఓలు గణేష్, రాజేందర్, స్తంభాద్రి ఉత్సవ కమిటీ బాధ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిమాండ్ ఆధారంగా యూనిట్ల ఎంపిక

ఇందిరా మహిళా శక్తి పథకం కింద లబ్ధిదారులు స్థానికంగా ఉన్న డిమాండ్ ఆధారంగా యూనిట్లు ఏర్పాటుచేసుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ బ్యాంకు లింకేజ్ రుణాలతో పచ్చళ్ల తయారీ, కిరాణాషాపులు, మొబైల్ టిఫిన్ సెంటర్లు, టైలరింగ్, టీ స్టాల్, మెడికల్ షాపు, మీసేవా కేంద్రాలు, బ్యూటీపార్లర్ తదితర యూనిట్లు ఏర్పాటుచేసే అవకాశమున్నప్పటికీ లాభం ఉండేవి మాత్రమే ఎంచుకునేలా పర్యవేక్షించాలని చెప్పారు. ఒకే చోట ఒకే రకమైన యూనిట్లు ఎక్కువగా ఉంటే ఎవరికీ లాభం జరగదని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ సన్యాసయ్య, అదనపు డీఆర్డీఓ నూరొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన డీఎఫ్ఓ సిద్ధార్థ్, అదనపు డీసీపీ ప్రసాదరావు

నిలిచిన పాస్‌పోర్టు సేవలు

ఖమ్మంగాంధీచౌక్: పాస్‌పోర్ట్ సేవా పోర్టల్ సాంకేతిక నిర్వహణ పనుల నేపథ్యాన పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ కేంద్రంలో సేవలు నిలిచిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా పాస్‌పోర్టు సేవా కేంద్రాలో గురువారం రాత్రి 8గంటల నుంచి సోమవారం ఉదయం 6గంటల వరకు సేవలు నిలిచిపోతాయని ముందుగానే అధికారులు ప్రకటించారు. ఇందులో భాగంగా ఖమ్మం హెడ్‌పోస్టాఫీస్‌లోని పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రంలో శుక్రవారం 95 మంది స్లాట్ బుక్ చేసుకున్నా వారికి రీ షెడ్యూల్ చేయనున్నట్లు సమాచారం ఇచ్చారు. అయితే, కొందరికి విషయం తెలియక సెంటర్‌కు వచ్చి వెనుదిరిగారు.

పోటీలను ప్రారంభిస్తున్న సీపీ సునీల్‌దత్, అధికారులు



క్రికెట్ మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తున్న సీపీ



క్రీడలతో మానసికోల్లాసం

పోలీసు కమిషనర్ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: క్రీడాశిక్షణతో పాటు పోటీల్లో పాల్గొనడం ద్వారా విధినిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించొచ్చని.. ఆపై శారీరక, మానసికోల్లాసం దరిచేరుతుందని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. ఖమ్మంలోని సిటీ పోలీస్ శిక్షణాకేంద్రంలో ట్రెయినీ కానిస్టేబుళ్లకు రెండు రోజుల పాటు నిర్వహించనున్న స్పోర్ట్స్ మీట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కాసేపు వాలీబాల్ ఆడడంతో పాటు క్రికెట్ మ్యాచ్‌లో బౌలింగ్ చేసిన సీపీ క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 263మంది సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లు ఇప్పటికే 70శాతం మేర శిక్షణ విజయవంతంగా పూర్తిచేసుకోవడం అభినందనీయమన్నారు. సీటీసీ ప్రిన్సిపాల్ నరేష్‌కుమార్, ఏఆర్ అడిషనల్ డీసీపీ విజయబాబు, ఏసీపీలు రవి, నర్సయ్య, ఆర్ఐలు అప్పలనాయుడు, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

పేరుకే కేంద్రం.. తొలిరోజు శూన్యం



పెసల నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

- పెసల కొనుగోళ్లను సాకులతో వాయిదా వేసిన అధికారులు
- మద్దతు ధర ఆశించిన రైతులకు నిరాశ

ఖమ్మంవ్యవసాయం: వ్యాపారుల చేతిలో రైతులు నష్టపోవద్దనే భావనతో ప్రభుత్వం పెసల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలని ఆదేశించింది. ఇంకేముంది ఖమ్మం మార్కెట్‌లో ఫ్లెక్సీ ఏర్పాటుచేయగా రైతులు ఆనందపడ్డారు. కానీ పెసల రాశులను పరిశీలించి నిర్దేశిత శాతం కంటే తేమ ఎక్కువగా ఉందని చెబుతూ కాలం గడిపారు. దీనికి తోడు బస్తాలను సమకూర్చుకోవాల్సి ఉన్నందున మరో రెండు రోజుల్లో కొనుగోళ్లు మొదలుపెడతామని చెప్పి వెనుదిరగడంతో రైతులు తిరిగి వ్యాపారులు చెప్పిన ధరకే అమ్ముకుని ఇంటిముఖం పట్టారు.



16.1 శాతంగా తేమ చూపిస్తున్న యంత్రం

మద్దతు ధర రావడం లేదని...

కేంద్రప్రభుత్వం ఈ ఏడాది క్వింటా పెసలకు రూ.8,682 మద్దతు ధర ప్రకటించింది. అయితే గ్రామాలు, మార్కెట్లలో వ్యాపారులు రూ.5వేల నుంచి రూ.6వేల వరకే చెల్లిస్తున్నారు. దీంతో రైతులకు నష్టం ఎదురవుతోంది. ఈ విషయాన్ని జిల్లాకు చెందిన రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన మార్క్‌ఫెడ్ ద్వారా పెసలు కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఈమేరకు గురువారం సాయంత్రం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మార్క్‌ఫెడ్, డీసీఎంఎస్, వ్యవసాయ శాఖల అధికారులతో సమావేశమై ఖమ్మం, వైరా, మధిర వ్యవసాయ మార్కెట్లలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

హడావుడిగా...

ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం ప్రభుత్వ శాఖల అధికారులు ఖమ్మం మార్కెట్‌లో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఆపై పలువురు రైతులు తీసుకొచ్చిన పెసలను పరిశీలించి నాణ్యతా ప్రమాణాల ప్రకారం 12 శాతం తేమ ఉండాలని.. 16.1 శాతం ఉన్నందున కొనుగోలు చేయలేమని చెప్పారు. దీంతో రైతులు వ్యాపారుల వద్ద నుంచి యంత్రాలను తీసుకువచ్చి పరిశీలిస్తే నిబంధనలకు అనుగుణంగానే తేమ ఉండడంతో నిలదీశారు. అయినా గన్నీ బ్యాగులు, ఇతర సామగ్రి సమకూర్చుకోవాల్సి ఉన్నందున రెండు రోజుల్లో కొనుగోళ్లు మొదలు పెడతామని దాటవేశారు. ఫలితంగా దిక్కుతోచని రైతులు వ్యాపారులు చెప్పినధరకే అమ్ముకున్నారు. శుక్రవారం పెసలు క్వింటాకు రూ.5వేల నుంచి రూ.6,900 ధర పలికింది. కాగా, కొనుగోలు కేంద్రం ప్రారంభ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ సునీత, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఏ.అలీం, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ కె.సందీప్, ఖమ్మం మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్‌తో పాటు కల్వకుంట్ల గోపాల్‌రావు, తల్లాడ రమేష్, దిరిశాల వెంకటేశ్వరరావు, ముత్యం ఉప్పల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి జిల్లా పరిధిలో డిపోల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు శనివారం డయల్ యువర్ రీజినల్ మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సమస్యలు ఎదుర్కొంటున్న వారితో పాటు సలహాలు ఇవ్వాలనుకునే వారు ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు 99592 25953 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆర్‌ఎం సరిరామ్ సూచించారు.

మధిరకు ఓఆర్‌ఆర్!





మధిర పట్టణం వ్యూ (ఇన్‌సెట్) సర్వే చేస్తున్న ఉద్యోగులు (ఫైల్)

- 12 గ్రామాల్లో సర్వే.. ఆపై భూసేకరణ
- ఇప్పటికే రంగంలోకి దిగిన సర్వేయర్లు

మధిర: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న మధిరకు త్వరలోనే ఔటర్ రింగ్ రోడ్డు మణిహారంగా నిలవనుంది. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా రూ.కోట్లాది నిధులతో లింకు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఆయన మధిరకు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించారు. ఈమేరకు సర్వే చురుగ్గా సాగుతుండగా.. త్వరలోనే నివేదిక సమర్పిస్తే నిధులు కేటాయింపు, టెండర్ల ప్రక్రియ మొదలుకానుంది.

రింగ్ రోడ్డు ఎందుకంటే..

మధిర నడిబొడ్డున రైల్వే ట్రాక్ ఉండడంతో పట్టణం రెండు భాగాలు విడిపోయింది. ఓ పక్క నుంచి ఇంకో వైపునకు వెళ్లాలంటే ఆర్‌ఓబీ మాత్రమే ఆధారంగా నిలుస్తోంది. ఇక పట్టణంలో కానీ బ్రిడ్జిపై కానీ ఏదైనా ప్రమాదం జరిగితే ఎర్రుపాలెం, నందిగామ వైపు నుంచి వైరా లేదా ఖమ్మం వైపునకు రాకపోకలు స్తంభిస్తున్నాయి. దీనికి తోడు ఇరుకు రోడ్ల కారణంగా భారీ వాహనాలు సాఫీగా ముందుకు సాగడం లేదు. అలాగే, ఖమ్మం నుంచి విజయవాడ వెళ్లాలంటే పలుచోట్ల టోల్ టాక్స్ చెల్లించాల్సి ఉండడంతో ఖమ్మం, వైరా తదితర ప్రాంతాల వారు మధిర మీదుగా వెళ్తున్నారు. ఫలితంగా ట్రాఫిక్ మరింత పెరిగింది. ఈ సమస్యను కొన్నాళ్లుగా గమనిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి శాశ్వతంగా పరిష్కరించేందుకు నాలుగు లేన్లతో కూడిన ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదించారు.

21మందితో సర్వే

ఇటీవలే కాంగ్రెస్ అధికారంలోకి రావడం, మధిర నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న భట్టి విక్రమార్కకు డిప్యూటీ సీఎం పదవిలో ఉండడంతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించారు. పట్టణానికి చుట్టూ ఉన్న గ్రామాల్లో సర్వే కోసం 16 మంది సర్వేయర్లతో పాటు ఐదుగురు డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్లను కేటాయించారు. మాటూరు, నాగవరప్పాడు, నిధానపురం, దెందుకూరు, రాయపట్నం, ఇల్లెందులపాడు, మడుపల్లి, మోటమర్రి, మునగాల, ఆత్కూరు, నక్కలగరుబు, వంగవీడు గ్రామాల్లో మొత్తంగా 296.73 ఎకరాల్లో సర్వే చేయనున్నారు. అనంతరం ఓఆర్‌ఆర్ నిర్మాణానికి కావాల్సిన భూమి, ఇతర వివరాలతో నివేదికను డిప్యూటీ సీఎంకు సమర్పించనుండగా.. ఆపై నిధుల కేటాయింపు, టెండర్ల ప్రక్రియ మొదలవుతుందని చెబుతున్నారు.

మద్దులపల్లి మార్కెట్ కమిటీ నియామకం

చైర్మన్, వైస్‌చైర్మన్లుగా హరినాథ్‌బాబు, నరేందర్‌రెడ్డి

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం రూరల్ మండలంలోని మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్‌కు నూతన కమిటీని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు చైర్మన్‌గా ఖమ్మం రూరల్ మండలంలోని చిన్న వెంకటగిరికి చెందిన బైరు హరినాథ్‌బాబు(బీసీ జనరల్), వైస్ చైర్మన్‌గా వనవాసం నరేందర్‌రెడ్డి నియమితులయ్యారు. అలాగే, డైరెక్టర్లుగా మత్యుం కృష్ణారావు, కర్లపూడి భద్రకాళి, తేజావత్ పంతులు, ఉప్పగుండ్ల ప్రసాద్, వంగూరి రవి, ధరావత్ బాబు, నల్లమల ప్రతాప్, జడల నగేష్, నంద్యాల శ్యాంసుందర్‌రెడ్డి, బానోత్ హుస్సేన్, కన్నేటి జ్యోతి, పాటిబండ్ల శ్రీలక్ష్మితో పాటు బీరోలు పీఏసీఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, కూసుమంచి ఏడీఏ, మద్దులపల్లి స్పెషల్ ఆఫీసర్‌ను నియమించారు. ఈ కమిటీ రెండేళ్ల పాటు అమల్లో ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈసందర్భంగా చైర్మన్ హరినాథ్‌బాబును శుక్రవారం సాయంత్రం మార్కెట్ కార్యదర్శి పోలవరపు వీరాంజనేయులు, ఉద్యోగులు ఎస్.కే.సాధిక్, వి.రాంబాబు తదితరులతో పాటు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



హరినాథ్‌బాబు(ఎడమ నుంచి రెండో వ్యక్తి)కు శుభాకాంక్షలు చెబుతున్న ఉద్యోగులు

నేలకొండపల్లి చైర్మన్‌గా సీతారాములు



సీతారాములు

నేలకొండపల్లి: నేలకొండపల్లి మార్కెట్ నూతన పాలకవర్గాన్ని ప్రకటించారు. ఈమేరకు కమిటీ చైర్మన్‌గా కొత్త కొత్తూరు గ్రామానికి చెందిన వెన్నపూసల సీతారాములు, వైస్ చైర్మన్‌గా కొండపర్తి సురేష్ నియమితులయ్యారు. అలాగే, డైరెక్టర్లుగా మీసా నాగేశ్వరరావు, సూరేపల్లి రవి, చిట్టూరి అచ్చయ్య, భూక్యా సీత్యానాయక్, మొక్క ఉపేందర్, బాణోత్ బొంగా నాయక్, కంచర్ల సుధీర్‌రెడ్డి, చాట్ల సత్యనారాయణ, తిప్పని సరోజిని, బాణోత్ సైదానాయక్, వొరుగంటి కిరణ్‌కుమార్, బోనగిరి సాయి రాజేష్‌తో పాటు రాజేశ్వరపురం సొసైటీ చైర్మన్, మార్కెటింగ్ డీఎం, కూసుమంచి ఏడీఏ, నేలకొండపల్లి స్పెషల్ ఆఫీసర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా

వెల్ఫేర్ ఆర్ఐగా నాగేశ్వరరావు



సీపీకి పూలమొక్క ఇస్తున్న ఆర్ఐ నాగేశ్వరరావు

ఖమ్మంక్రైం: ఖమ్మం కమిషనరేట్‌కు ఇటీవల బదిలీపై వచ్చిన ఆర్ఐ నాగేశ్వరరావు సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో వెల్ఫేర్ విభాగం ఆర్ఐగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన సీపీ సునీల్‌దత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నేటి నుంచి విధుల్లోకి కూసుమంచి లెక్చరర్లు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని కూసుమంచికి ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేయగా 11మందిని గెస్ట్ లెక్చరర్లను ఎంపిక చేశారు. ఈనేపథ్యాన వీరు శనివారం నుంచి విధుల్లోకి రావాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు సూచించారు. వివిధ సబ్జెక్టులు బోధించేందుకు 635 దరఖాస్తు చేసుకోగా విద్యార్హతలు, సీనియారిటీ, డెమో ఆధారంగా 11మందిని ఎంపిక చేశామని తెలిపారు. ఈ ప్రక్రియ అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ పర్యవేక్షణలో జరిగిందని పేర్కొన్నారు. ఇక నాన్ ఆరుగురు బోధనేతర సిబ్బందిని నియమించనుండగా 1,417దరఖాస్తులు వచ్చాయని, ఇందులో స్థానికత, ఇతర నిబంధనల ప్రకారం ఎంపిక చేస్తామని డీఐఈఓ రవిబాబు తెలిపారు.

వీ.వీ.పాలెంలో ఒకరికి డెంగీ పాజిటివ్



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెంలో ఒకరికి శుక్రవారం డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. డెంగీ బారిన పడిన వ్యక్తి ఇంటిని సందర్శించిన డీఎంహెచ్ఓ వరికూటి సుబ్బారావు చికిత్స, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమల బెడద ఉండదని తెలిపారు. ఆతర్వాత మంచుకొండ పీహెచ్‌సీ ఆధ్వర్యాన నిర్వహించిన మెడికల్ క్యాంపును డీఎంహెచ్ఓ పరిశీలించారు. పీహెచ్‌సీ పర్యవేక్షకులు తాళ్లూరి శ్రీకాంత్, సిబ్బంది మేడా పుష్పావతి, కృష్ణయ్య పాల్గొన్నారు.

టాటా ఏస్, లారీ ఢీ.. రోడ్డుకు అడ్డంగా బోల్తా

- భారీగా ట్రాఫిక్ జామ్



రోడ్డుపై అడ్డంగా పడిన వాహనం

కొణిజర్ల: టాటా ఏస్, లారీ ఎదురెదురుగా ఢీకొనగా ఏస్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. అయితే, వాహనం నడి రోడ్డుపై బోల్తా పడడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. కొనిజర్ల ఎస్ఐ జి.సూరజ్ తెలిపిన వివరాలు... హైదరాబాద్ నుంచి ఏపీలోని వైజాగ్‌కు జనరేటర్ తీసుకెళ్తున్న టాటా ఏస్ వాహనాన్ని వైరా నుంచి ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టాటా ఏస్ రోడ్డుపై అడ్డంగా బోల్తా పడడంతో డ్రైవర్ దేరంగుల యాదయ్యకు తీవ్ర గాయమైంది. అలాగే, వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో వైరా సీఐ సాగర్‌నాయక్, ఎస్ఐ సూరజ్ సిబ్బందితో చేరుకుని డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించాక వాహనాన్ని తొలగించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

రైలుకింద పడి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి(40) ఆత్మహత్య చేసుకన్నాడు. ఖమ్మం జీఆర్పీ ఎస్ఐ భాస్కర్‌రావు తెలిపిన వివరాలు... ఖమ్మంలోని వాణి ఐటీఐ సమీపాన విజయవాడ వైపు వెళ్తున్న వందేభారత్ రైలు క్రిందపడి సదరు వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని ఎస్సై చెప్పారు. కాగా, మృతదేహాన్ని అన్నం ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,900	5,000
మిర్చి	17,000	8,000
మిర్చి తాలు	9,000	9,000
ఏసీ మిర్చి	19,200	11,800
ఏసీ తాలు	9,000	7,000
పత్తి	7,550	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,828

నర్సరీ నారు.. బహుబాగు!

అప్రమత్తంగా ఉంటే అధిక దిగుబడి

- జిల్లాలో ఏటా పెరుగుతున్న మిర్చి నర్సరీలు
- రైతులు అవగాహన పెంచుకుంటేనే ఫలితం
- నిర్వహణపై దృష్టి సారించిన అధికారులు

మధిర: జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మిర్చి సాగు విస్తీర్ణం పది శాతం తగ్గే అవకాశముందని భావిస్తున్నారు. గత ఏడాది మిర్చికి ధర లేకపోవడం, చీడపీడలతో దిగుబడి తగ్గడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. జిల్లాలో గత ఏడాది 92,273 ఎకరాల్లో మిర్చి సాగు చేయగా ఈ ఏడాది 80వేల ఎకరాలకే పరిమితమయ్యే అవకాశముందని సమాచారం. అయితే, రైతులు సొంతంగా కంటే నర్సరీల నుంచి నారు కొనుగోలుకే మొగ్గు చూపుతున్నారు. తద్వారా నర్సరీలో సంఖ్య పెరిగింది. కాగా, రైతులు నారు కొనుగోలు సమయాన తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే దిగుమబడి బాగుంటుందని, లేకపోతే నష్టపోయే ప్రమాదముందని అధికారులు సూచిస్తున్నారు. అంతేకాక నిబంధనలు అతిక్రమించకుండా నర్సరీల నిర్వాహకులకు సూచనలు చేస్తున్నారు.

రైతుల ఆసక్తిని అనుగుణంగా..

సొంతంగా మిరప నారు సాగు చేసుకోవడం కంటే ఎక్కువ మంది రైతులు నర్సరీలపైనే ఆధారపడుతున్నారు. నారుమడుల్లో కంటే నర్సరీల్లో షేడ్‌నెట్ల కింద పెంచిన నారుతో మంచి దిగుబడి వస్తుందనే నమ్మకముంది. దీంతో రైతుల ఆసక్తికి అనుగుణంగా నర్సరీల సంఖ్య పెరుగుతోంది. జిల్లాలోని మధిర, కొణిజర్ల, కామేపల్లి, ఏన్కూరు తదితర మండలాల్లో నర్సరీలు ఎక్కువగా ఉన్నాయి. రైతులు పలువురు ముందుగానే బుక్ చేసుకుని నారు కొనుగోలు చేసి నాటారు. మరికొందరు నాటేందుకు సిద్ధమవుతున్నారు.





మాటూరులోని నర్సరీలో సిద్ధంగా ఉన్న మిర్చి నారు (ఇన్‌సెట్) నాణ్యత కలిగిన మిరప మొక్క

తేజ రకంపైనే దృష్టి

ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్, సూర్యాపేట తదితర జిల్లాల్లో రైతులు తేజ రకం మిర్చి ఎక్కువగా సాగు చేస్తారు. ఈ రకం మిర్చికి మెరుగైన ధర లభించడంతో పాటు విదేశాలకు ఎగుమతి చేస్తారు. అందుకే రైతులు ఎక్కువగా ఆసక్తి బకనరుస్తున్నారు. ఈమేరకు కొన్ని నర్సరీల్లో యజమానులు ముందుగానే ఎంపిక చేసిన రకాలతో నారు సిద్ధం చేస్తుండగా.. మరికొందరు రైతులు తామే విత్తనాలు ఇచ్చి నారు పెంచుకుంటారు.

జిల్లాలో నర్సరీల సంఖ్య

ఏడాది	నర్సరీలు
2020	106
2021	191
2022	203
2023	247
2024	270

నర్సరీలపై ప్రత్యేక నిఘా

జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న మిరపన నర్సరీలను ఉద్యాన శాఖ నిఘా పెంచింది. రైతులు ఎక్కువ మంది నర్సరీలపైనే ఆధారపడుతుండగా, గతంలో పలుమార్లు కల్తీ నారు కారణంగా నష్టపోయారు. దీంతో ఈసారి ఉద్యాన శాఖ అధికారులు జిల్లాలో మిర్చి నర్సరీలను తనిఖీ చేస్తున్నారు. అలాగే, నిర్వాహకులతో సమావేశమై నిబంధనలు వివరిస్తున్నారు. తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని.. మిరప విత్తనాల బిల్లులు భద్రపర్చుకోవడమే కాకుండా రైతులకు పూర్తి వివరాలతో రశీదు ఇవ్వాలని సూచిస్తున్నారు. లైసెన్స్ లేకుండా నర్సరీ నిర్వహించినా, నారు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. కాగా, నకిలీ విత్తనాలతో నారు పెంచినట్లు తేలితే రూ.50 వేల జరిమానా లేదా ఏడాది జైలు శిక్ష... ఒక్కోసారి రెండూ విధించే అవకాశమున్నందున జాగ్రత్త వహించాలని సూచిస్తున్నారు.



మధిర సమీపాన నర్సరీలో తనిఖీ చేస్తున్న జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్(ఫైల్)

చేతి నిండా పని..



నర్సరీల్లో మిరప నారు పెంచుతుండడంతో మా లాంటి కూలీ లకు చేతి నిండా పని దొరుకుతోంది. ట్రేల్లో కోకో పిట్ నింపడం దగ్గర నుంచి విత్తనాలు విత్తడం, కలుపు తీయడం, నారు పీకి కట్టలు కట్టడం వంటి పనులు చేస్తున్నాం. ఇంకొన్ని రోజులు మాకు పని ఉంటుంది.

– పుట్టా దానమ్మ, కూలీ, మాటూరు

పొలాన్ని సిద్ధం చేశాం..



మిరప నారు చేతికి రాగానే నాటేలా పొలాన్ని సిద్ధం చేసి చేసి ఉంచాం. గత ఏడాది మిర్చి రేటు అనుకూలించ లేదు. ఈ ఏడాదైనా చీడపీడలు, వైరస్ లేకుండా మంచిగా దిగుబడి వచ్చిరేటు కలిసి వస్తుందేమో చూడాలి. ఇప్పటికైతే మూడు ఎకరాల్లో మిర్చి సాగుకు సిద్ధమయ్యాను.

– మేడిశెట్టి వెంకటేశ్వర్లు, రైతు, మాటూరు

నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు



మిర్చి రైతులు నాణ్యమైన విత్తనాలు, నారు ఎంపిక చేసుకోవాలి. లైసెన్స్ కలిగిన నర్సరీలో మాత్రమే నారు కొనుగోలు చేయాలి. పంట పూర్తయ్యేంతవరకు అన్ని బిల్లులను భద్రపర్చుకోవాలి. అలాగే, 45 రోజులు వయసు కలిగిన నారు మాత్రమే నాటితే ఫలితం ఉంటుంది. ఏ మాత్రం అనుమానంవచ్చినా ఉద్యాన అధికారికి ఫిర్యాదు చేయొచ్చు. ఇక నర్సరీల నిర్వాహకులు సైతం అన్ని నిబంధనలుపాటించాలి. అలాకాకుండా వ్యవహరించి రైతులకు నష్టం కలిగిస్తే సహించేది లేదు.

– ఎం.వీ.మధుసూదన్, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమాభివృద్ధి అధికారి

తలసేమియాపై అవగాహన అవసరం

- చిన్నారులకు 'సంకల్ప' సేవలు వెలకట్టలేనివి
- అడిషనల్ డీసీపీ విజయబాబు, డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌గౌడ్



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ విజయబాబు, పక్కన డీసీహెచ్ఎస్ రాజశేఖర్ తదితరులు

ఖమ్మంవైద్యవిభాగం: దేశంలో పోలియో నిర్మూలన కోసం అవగాహన కల్పించిన మాదిరిగానే తలసేమియాపైనా పోరాడాలని.. ఇందుకోసం అన్నివర్గాల ప్రజలు అవగాహన పెంచుకోవాలని అడిషనల్ డీసీపీ ఈ.విజయబాబు, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రాజశేఖర్‌గౌడ్ కోరారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ 14వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం సంస్థ వ్యవస్థాపకురాలు పి.అనిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో విజయబాబు మాట్లాడుతూ ఒకప్పుడు ఉధృతంగా పోలి యో వ్యాధిని ఎలా తరిమికొట్టామో అదే మాదిరి సమష్టిగా కృషి చేస్తే తలసేమియాను అరికట్టడం కష్టమేమీ కాదన్నారు. ఎవరైనా తన వద్దకు పెళ్లి కార్డుతో వస్తే ముందుగా తలసేమియా పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తానని తెలిపారు. కాగా, తలసేమియా బారిన పడిన చిన్నారులకు సంకల్ప సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. చిన్నారులకు అవసరమైన రక్తం కోసం తమ సిబ్బందితో శిబిరాలు ద్వారా ఏర్పాటు చేస్తామని తెలిపారు. డీసీహెచ్ రాజశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది కూడా తలసేమియా చిన్నారులకు అండగా ఉంటారని చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారులతో కేక్ కట్ చేయించగా వారు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ ఎన్.నర్సయ్య, వైద్యులు నారాయణమూర్తి, రాంప్రసాద్, గణేష్, అనురాధ, సంకల్ప స్వచ్ఛంద సేవాసంస్థ బాధ్యులు పి.పావని, పి.రవిచందర్, ఉదయ్‌భాస్కర్, వంశీ కిరీటి, ఎస్.ఉపేందర్, నాగేశ్వరరావు, ప్రియ తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

రేపటి నుంచి స్వచ్ఛ పక్వాడా

- జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిర్వహణ
- విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించడమే లక్ష్యం



నేలకొండపల్లి మండలం సదాశివాపురం ప్రభుత్వ పాఠశాల

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో స్వచ్ఛత కార్యక్రమాల నిర్వహణకు నిర్ణయించింది. ఈమేరకు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు స్వచ్ఛ పక్వాడా పేరిట పక్షోత్సవాలు నిర్వహించనున్నారు. జిల్లాలోని 1,235 పాఠశాలల్లో 54,038మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే, ఇటీవల వర్షాల నేపథ్యాన పలువురు విషజ్వరాల బారిన పడుతున్నారు. ఈనేపథ్యాన పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది.

కార్యక్రమాల షెడ్యూల్

పక్షోత్సవాల్లో భాగంగా ఏరోజు ఏ కార్యక్రమం నిర్వహించాలో ఉన్నతాధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. ఇందులో భాగంగా తొలిరోజైన 1వ తేదీన ఉపాధ్యాయులు, విద్యార్థులతో స్వచ్ఛతా శపథం చేయిస్తారు. ఇక 2, 3వ తేదీల్లో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన, 4, 5వ తేదీల్లో సమాజానికి చేరువ దినోత్సవం సందర్భంగా స్థానికులతో విద్యార్థులను మమేకం చేసి స్వచ్ఛత ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తారు. అలాగే, 6వ తేదీన హరిత దినోత్సవం సందర్భంగా పాఠశాలలో మొక్కలు నాటించి, 7, 8వ తేదీల్లో వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ పోటీలు నిర్వహిస్తారు. ఇక 9, 10వ తేదీల్లో చేతుల శుభ్రత ప్రాముఖ్యతను వివరించి, 11న వ్యక్తిగత పరిశుభ్రత దినోత్సవంగా నిర్వహిస్తారు. ఆపై 12న సమాజంలో విద్యార్థిని భాగస్వామ్యం చేయడం, 13, 14వ తేదీల్లోస్వచ్ఛతపై సిద్ధం చేశాక 15వ తేదీన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తారు.

ప్రణాళికాయుతంగా అమలుచేస్తాం



స్వచ్ఛ పక్వాడా కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తాం. జిల్లాలోని 1,235 పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా, ప్రణాళికబద్ధంగా నిర్వహించేలా ఇప్పటికే సూచనలు చేశాం. విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది.

– సోమశేఖరశర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

విద్యాబోధనలో సాంకేతికతను వినియోగించాలి..

- రిటైర్డ్ ఏఐఎస్ ఆకునూరి మురళి
- కలెక్టర్‌తో భేటీ, మధిరలో పర్యటన



మధిరలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

ఖమ్మం సహకారనగర్/మధిర/చింతకాని: విద్యాబోధనలో సాంకేతికను వినియోగిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అభిప్రాయపడ్డారు. కొడంగల్, మధిర నియోజకవర్గాల్లో మొదటి విడతగా అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో స్కూళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించగా.. ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు, బోధన, విద్యార్థుల నైపుణ్యాలు, ఇంటర్నేషనల్ స్కూళ్ల ఏర్పాటుకు ఉన్న వసతుల పరిశీలనకు ఆయన పర్యటిస్తున్నట్లు తెలిసింది. ఈమేరకు శుక్రవారం ఖమ్మం వచ్చిన ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో సమావేశమై పాఠశాలల్లో బోధన, ఇతర అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిశీలనకు ప్రతీ బుధవారం చేపడుతున్న తనిఖీలు, ఇంగ్లిష్ ల్యాబ్‌ల ఏర్పాటును కలెక్టర్ వివరించినట్లు తెలిసింది. అనంతరం ఆయన చింతకాని మండలం రాఘవాపురం, నర్సింహాపురం, రేపల్లెవాడల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా బోధన సాగాలని, విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించేలా ఇంగ్లిష్ మీడియంలో బోధించాలని తెలిపారు. ఆతర్వాత మధిరలోని క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలతో సమావేశమయ్యారు. తక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలను తొలగించి అక్కడి విద్యార్థులను బస్సుల్లో ప్రభుత్వమే ఇంటర్నేషనల్ స్కూళ్లకు పంపించేలా ప్రణాళిక రూపకల్పన చేస్తున్నట్లు చెప్పారని తెలిసింది. డీఈఓ సోమశేఖరశర్మ, సెక్టోరియల్ అధికారి రవికుమార్, ఎంఈఓ మోదుగు శ్యాంసన్, కాంప్లెక్స్ హెచ్ఎంలు బీవీ.శర్మ, శ్రీనివాసరావు, ఎంఎన్ఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతీరోజు 30 గ్రామాల్లో కుటుంబ నిర్ధారణ సర్వే



రాజేశ్వరపురంలో రైతు కుటుంబంతో సెల్ఫీ దిగుతున్న డీఏఓ, ఏఓ

నేలకొండపల్లి/కూసుమంచి: జిల్లాలో రుణమాఫీ వర్తించని రైతుల కుటుంబాలను నిర్ధారించేందుకు ప్రతీరోజు 30 గ్రామాల్లో సర్వే చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య తెలిపారు. నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంతో పాటు కూసుమంచిలో వివరాల నమోదును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 50వేల కుటుంబాల వివరాలు యాప్‌లో నమోదు చేయాల్సి ఉండగా, సర్వే శరవేగంగా జరుగుతోందని తెలిపారు. గ్రామాలకు అధికారులు వచ్చినప్పుడు రైతులు లేకున్నా ఆందోళన చెందొద్దని, మరోమారు వచ్చి నమోదు చేస్తారని వెల్లడించారు. అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ అవుతుందని తెలిపారు. ఏడీఏ బి.సరిత, ఏఓలు డి.అరుణకుమారి, వాణి, అరుణ, ఏఈఓలు అవినాష్, శిరీష, ధాత్రి, సాయినిఖిల, అరవింద్, ఈశ్వరి, ప్రియాంక, రవీందర్, మానస, రవికుమార్ పాల్గొన్నారు.

కేబుల్ గుంతలో దిగబడిన బైక్



గుంతలో దిగబడిన బైక్ ముందు చక్రం

కూసుమంచి: మండలంలోని పాలేరులో కేబుల్ లైన్ కోసం తవ్విన గుంతలో శుక్రవారం ఓ బైక్ దిగబడింది. గ్రామంలో కేబుల్ వైర్లు వేసేందుకు గుంతలు తవ్వినప్పటికీ అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో గోపాతండాకు చెందిన యువకుడు వెళ్తుండగా ఆయన బైక్ ప్రమాదవశాత్తు గుంతలో దిగబడింది. ఈ ఘటనలో యువకుడికి గాయాలు స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అయితే, హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయని కాంట్రాక్టర్‌పై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మోటార్ల దొంగల ముఠా అరెస్టు

ఇద్దరు మైనర్లు సహా పలువురి రిమాండ్

పెనుబల్లి: పెనుబల్లి మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ మోటార్లు, ట్రాక్టర్ టైర్లు, బ్యాటరీలు చోరీ చేసి అమ్ముకుంటున్న ముఠాను వీఎం బంజర్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈసందర్భంగా సూరయ్యబంజర్ తండాకు చెందిన ఇద్దరు మైనర్లు, వారి నుంచి సామాగ్రి కొనుగోలు చేసి ఇతరులకు అమ్ముతున్న వారే కాక సామాగ్రి కొనుగోలు చేసిన పలువురిని రిమాండ్‌కు తరలించినట్లు కల్లూరు ఏసీపీ రఘు తెలిపారు. ఈమేరకు వివరాలను శుక్రవారం వీఎం బంజర్ పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. సూరయ్యబంజర్‌కు చెందిన ఇద్దరు మైనర్లు దురలవాట్లకు బానిసలై సులభంగా డబ్బు సంపాదించేందుకు చోరీలు చేస్తున్నారు. వీరితో కలిసి కేలోతు రవి, కొర్రా బిచ్చానాయక్, కేలోతు టక్రియా, కేలోతు శ్రీహరి, భూక్యా గోపాలస్వామి, గుగులోతు గోపాలకృష్ణ, భూక్యా రవీంద్రబాబు, ఇస్లావత్ సక్రుస్వామి, వాంకుడోతు ఉపేందర్ పెనుబల్లి, వేంసూరు మండలాల్లో విద్యుత్ మోటార్లు, సిగ్నల్ టవర్ బ్యాటరీలు, ట్రాక్టర్ టైర్లు చోరీ చేస్తున్నారు. ఇప్పటికే పెద్దమొత్తంలో సామగ్రిని అమ్ముకోగా మరో దఫా సామగ్రితో ఆటోలో వెళ్తుండగా వీఎం బంజర్ ఎస్సై కె.వెంకటేష్ ఆధ్వర్యాన అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అంతేకాక గతంలో సొత్తు కొనుగోలు చేసిన భూక్యా వాల్యా, బాణోతు రామకృష్ణ, భూక్యా బాలాజీ గుగులోతు మురళీకృష్ణను సైతం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ రఘు వెల్లడించారు. ఈ సమావేశంలో సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తిలింగయ్య, ఎస్సై కె.వెంకటేష్ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలను కడతేర్చిన తండ్రికి యావజ్జీవ శిక్ష

సత్తుపల్లిటౌన్/మధిర: భార్యపై కక్ష, అనుమానంతో అభం.. శుభం తెలియని చిన్నారులను కడతేర్చిన తండ్రికి యావజ్జీవ శిక్ష విధిస్తూ సత్తుపల్లి ఆరో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి మారగాని శ్రీనివాస్ శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్, మధిర సీఐ డి.మధు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా మధిర మండలం రాయపట్నం గ్రామానికి చెందిన పార్శపు శివరామ గోపాల్ అదే గ్రామానికి చెందిన మార్తమ్మను వివాహం చేసుకున్నాడు. వీరికి రామకృష్ణ(7), అరాధ్య(6) పిల్లలు జన్మించగా.. ఉన్నారు. అయితే భార్యపై అనుమానం పెంచుకున్న శివరామగోపాల్ మద్యానికి బానిసై తరచూ వేధించేవాడు. దీంతో ఆమె అదే గ్రామంలోని పుట్టింట్లో ఉంటూ తన ఇద్దరు పిల్లలను చదివిస్తోంది. గత ఏడాది జూలై 10వ తేదీన స్కూల్‌లో ఉన్న పిల్లలను శివరామ గోపాల్ తన ఇంటికి తీసుకెళ్లి గొంతు నులిమి చంపి గోనె సంచిలో పెట్టి పరారయ్యాడు. పాఠశాల సమయం ముగిసినా రాకపోవడంతో అనుమానం వచ్చిన మార్తమ్మ స్థానికులతో కలిసి శివరామగోపాల్ ఇంటికి వెళ్లే సరికి ఎవరూ కానరాలేదు. చివరకు ఇళ్లంతా వెతకగా బీరువా పక్కన గోనెపట్టాలను తొలగించడంతో చలనం లేకుండా రామకృష్ణ, ఆరాధ్య కనిపించారు. వీరిని ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు మార్తమ్మ ఫిర్యాదుతో అప్పట్లో ట్రెయినీ ఐపీఎస్ అధికారి అవినాష్‌కుమార్ కేసు నమోదు చేసి చార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసును విచారణలో భాగంగా సత్తుపల్లి ఆరో అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీనివాస్ ముప్పై మంది సాక్షులను విచారించగా శివరామ గోపాల్‌పై నేరం రుజువు కావడంతో యావజ్జీవ శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. అలాగే, వేధింపుల చట్టం కింద మరో ఆరో నెలల జైలు, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీ అబ్దుల్‌బాషా వాదించగా.. ఉద్యోగులు రామారావు, శ్రీను సహకరించారు. కాగా, పకడ్బందీగా దర్యాప్తు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేయడం ద్వారా నిందితుడికి శిక్ష వేయించగలిగామని మధిర సీఐ డి.మధు వెల్లడించారు.

గుడిసెలు తొలగించొద్దని టవర్ ఎక్కిన యువకుడు



చందర్‌రావును పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్తున్న సీఐ, పోలీసులు

రఘునాథపాలెం: ఖమ్మంలోని వెలుగుమట్ల సమపాన తమ గుడిసెలను తొలిగించవద్దంటూ ఓ యువకుడు రఘునాథపాలెం మండలం వీవీపాలెంలోని సెల్‌టవర్ ఎక్కి రెండు గంటల పాటు హల్‌చల్ చేశాడు. నాలుగు రోజుల క్రితం వెలుగుమట్ల గుట్టపై పట్టాభూముల్లో గుడిసెలు వేశారని కొందరు తొలగించేందుకు యత్నించారు. ఈక్రమంలో ఘర్షణ జరిగిన విషయం విదితమే. ఈమేరకు కామేపల్లి మండలం పాత లింగాలకు చెందిన నరాటి చందర్‌రావు అలియాస్ చంద్రశేఖర్ సైతం అక్కడ గుడిసె వేసుకోగా తొలగిస్తారనే ఆందోళనతో శుక్రవారం ఉదయం వీవీ పాలెంలోని టవర్ ఎక్కాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా సీఐ ఉస్మాన్ షరీఫ్ ఆధ్వర్యాన సిబ్బంది చేరుకున్నారు. చందర్‌రావుతో ఫోన్‌లో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పడంతో ఆయనకు కిందకు దిగొచ్చాడు. దీంతో చందర్‌రావును పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రాక్షస రాజ్యంలో 'గుడ్ల'గూబలు!

విద్యార్థినుల వాష్‌రూమ్‌ల్లో సీక్రెట్ కెమెరాలు.. 300 వీడియోలు రికార్డు


కలెక్టర్, ఎస్పీల ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

"న్యూడ్ వీడియోలు ఇతర కాలేజీల విద్యార్థుల ఫోన్లలో ప్రత్యక్షమైనట్లు మాకు ఫోన్లు చేసి చెబుతున్నారు..!! డబ్బులు తీసుకొని వీడియోలు షేర్ చేస్తున్నారు."

"ఆందోళన, కేసులు అంటే మీ భవిష్యత్తు దెబ్బతింటుంది.. మీరు, మీ తల్లిదండ్రులు కోర్టుల చుట్టూ తిరగాల్సి ఉంటుంది.. సర్టిఫికెట్లు ఇవ్వరు అని బెదిరిస్తున్నారు. సీఎం చంద్రబాబు తక్షణమే వచ్చి దీనికి సమాధానం చెప్పాలి"

– గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థినుల ఆక్రోశం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: వేలాది మంది విద్యార్థినులు చదువుతున్న కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల వాష్ రూమ్‌లలో రహస్య కెమెరాలు అమర్చిన తీవ్ర కలకలం రేపగా.. అధికార యంత్రాంగం ద్వారా దీన్ని కప్పిపుచ్చేందుకు సర్కారు విఫలయత్నం చేసింది. కాలేజీ నిర్వాహకులు టీడీపీ ప్రముఖులకు సన్నిహితులు కావడంతో దీన్ని పక్కదారి పట్టించేందుకు శతవిధాలా ప్రయత్నించింది. వాష్ రూమ్‌లో రహస్య కెమెరాలు అమర్చి వీడియోలను చిత్రీకరించారంటూ విద్యార్థినులు గురువారం రాత్రి నుంచి నిద్రాహారాలు లేకుండా తల్లడిల్లుతుండగా.. అర్ధరాత్రి హాస్టల్‌లో విద్యుత్తు సరఫరా నిలిపివేసి పోలీసులు గుట్టుగా తనిఖీలు నిర్వహించడం.. స్నానాల గదిలో షవర్లు ఊడదీసి తరలించడం ఈ అనుమానాలకు బలం చేకూర్చుతోంది. సీక్రెట్ కెమెరాలపై ఓ విద్యార్థిని వారం క్రితమే ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం... ఎదురు కేసులు పెడతామని బెదిరించడం.. సాహసించి మీరు ఫిర్యాదు చేసినా ఉదయానికల్లా ఆ వార్త ఫేక్ న్యూస్ అవుతుందని విద్యార్థులను వార్డెన్ హెచ్చరించడం.. మర్నాడు ఉదయం అధికారులు కూడా అది ఫేక్ న్యూస్ అని తొలుత బుకాయించడం గమనార్హం. ఇంత దారుణం జరిగితే సమస్యను చిన్నదిగా చూపేందుకు ప్రభుత్వ పెద్దలు యత్నించడం నివ్వెరపరుస్తోంది. దాదాపు 1,500 మంది విద్యార్థినులు ఉంటున్న చోట జరిగిన ఈ దారుణం వెనుక అధికార పార్టీకి చెందిన ముఖ్యులు ఉన్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.

వందల వీడియోలు...

రహస్య కెమెరాలతో ఇప్పటివరకు 300 మంది విద్యార్థినుల వీడియోలు చిత్రీకరించినట్లు తెలియడంతో గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. నిద్రాహారాలు లేకుండా వర్షంలోనూ హాస్టల్ వద్ద బైఠాయించి న్యాయం కావాలంటూ నినదించారు. తరగతులను బహిష్కరించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు బాయ్స్ హాస్టల్ వద్దకు చేరుకుని ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థిని అదుపులోకి తీసుకుని ఫోన్, ల్యాప్‌టాప్, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఒంగోలు విద్యార్థిని తండ్రికి టీడీపీ అండదండలు ఉండటంతో యాజమాన్యం వారితో కుమ్మక్కై విచారించకుండా హాస్టల్‌లో ఉంచి సకల సౌకర్యాలు కల్పిస్తోందని ఇతర విద్యార్థినులు ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం చేయాలంటూ ఆందోళన చేస్తున్న తమను సర్టిఫికెట్లు ఇవ్వబోమని, మార్కులు వేయమని బెదిరిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

కళాశాల వద్ద ఉద్రిక్తత..

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల వద్ద విద్యార్థులు సైతం విద్యార్థినులతో కలసి ఆందోళనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. న్యాయం చేయాలంటూ రోడ్డు మీద బైఠాయించారు. విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంఘాలు వారి ఆందోళనకు మద్దతు పలకడంతో కళాశాల వద్ద యుద్ధ వాతావరణం నెలకొంది. విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, పోలీసులు చర్చలు జరిపగా నిందితులను కఠినంగా శిక్షిస్తేనే ఆందోళన విరమిస్తామని తేల్చి చెప్పారు. మంత్రి కొల్లు రవీంద్ర, కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు, ఎమ్మెల్యేలు వర్ల కుమార్‌రాజా, యార్లగడ్డ వెంకట్రావ్, కాగిత కృష్ణప్రసాద్ కళాశాల వద్దకు చేరుకుని విద్యార్థినులతో పలు దఫాలు చర్చలు జరిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల యాజమాన్యం, వార్డెన్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇవ్వగా యాజమాన్యంపై తమకు నమ్మకం లేదని, రెండు రోజులుగా విషయం తెలిసినా కాలయాపన చేసిందని విద్యార్థినులు పేర్కొన్నారు. గురువారం రాత్రి నుంచి భోజనం, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం చేయకుండా, వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వారంతా మెయిన్ గేట్ వద్ద బైఠాయించారు. కెమెరాలు అమర్చినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ విద్యార్థిని తండ్రి పలుకుబడి ఉన్న టీడీపీ నేతగా చెబుతున్నారు. అధికార పార్టీ నేత కావడంతో ఈ దారుణాన్ని కప్పిపుచ్చేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని మండిపడుతున్నారు.

ప్రజా సంఘాల మద్దతు..

ఆందోళన చేస్తున్న విద్యార్థినులకు ఏబీవీపీ నాయకులు మద్దతు పలికారు. ఏబీవీపీ జిల్లా జాయింట్ సెక్రటరీ మాగంటి వెంకట గోపి, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు సీహెచ్ లీలాకుమారి, యువమోర్చా మహిళా జిల్లా సెక్రటరీ వి.అభినందన, నాయకులు కె.వరుణ్, గోపీలు విద్యార్థినులకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నారు. కోల్‌కతాలో రెసిడెంట్ వైద్యురాలిపై హత్యాచార ఘటనను మరువక ముందే వేల మంది విద్యార్థినులు ఉంటున్న హాస్టల్‌లో రహస్య కెమెరాల అంశం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. జాతీయ మహిళా కమిషన్ దృష్టికి తెచ్చి కారకులకు కఠిన శిక్షలు పడేవరకు పోరాడతామన్నారు.

అర్ధరాత్రి కరెంట్ ఆపేసి..

అర్ధరాత్రి హాస్టల్‌లో విద్యుత్తు సరఫరా నిలిపివేసి కనీసం జనరేటర్ ఆన్ చేయకుండా బాత్ రూమ్‌లలో పోలీసులు తనిఖీ చేశారని విద్యార్థినులు పేర్కొంటున్నారు. బాత్ రూమ్‌లో షవర్స్ మాత్రమే ఎందుకు తీసుకెళ్లారని ప్రశ్నిస్తున్నారు. షవర్లలో రహస్య కెమెరాలున్నట్లు పేర్కొంటున్నారు.

వారం క్రితమే తెలిసినా..

వాష్ రూమ్‌ల్లో సీక్రెట్ కెమెరాల వ్యవహారాన్ని ఓ విద్యార్థిని వారం రోజుల క్రితమే కాలేజీ యాజమాన్యం దృష్టికి తెచ్చినా నిర్లిప్తంగా వ్యవహరించింది. 'నిన్న సాయంత్రం 5 గంటలకు మరోసారి ఫిర్యాదు చేస్తే విచారణకు నెల సమయం కావాలన్నారు. ఫేక్ న్యూస్ అంటూ మళ్లీ రాత్రి ప్రచారం చేశారు. యజమాన్యం దృష్టికి తెచ్చిన విద్యార్థినిని, తండ్రిని పిలిపించండంటూ రివర్స్ కేసులు పెడతామని బెదిరించారు. మేమేం తప్పు చేశాం? న్యాయం కోరడమే నేరమా?' అని ఆ విద్యార్థి ప్రశ్నిస్తోంది.

ఆధారాలు నేరుగా నాకు పంపండి: ఏపీ సీఎం చంద్రబాబు

గుడ్లవల్లేరు కళాశాల విద్యార్థినుల వద్ద ఆధారాలుంటే నేరుగా తనకే పంపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఎవరూ అధైర్య పడవద్దని, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. శుక్రవారం ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రహస్య కెమెరాలపై సమగ్ర విచారణ జరపాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇంట్లో ఆడబిడ్డకు కష్టం వస్తే ఎలా స్పందిస్తామో అంతే సీరియస్‌గా స్పందించి నిజాలు నిగ్గు తేల్చాలన్నారు. విద్యార్థుల ఫిర్యాదును యాజమాన్యం నిర్లక్ష్యం చేసిందనే ఆరోపణపైనా విచారణ జరపాలన్నారు. ప్రతి మూడు గంటలకు ఒకసారి ఘటనపై తనకు రిపోర్ట్ చేయాలని అధికారులను ఆదేశించారు.

ఆ కాలేజీ టీడీపీ నేత బంధువుదే

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ టీడీపీ నేత, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే భార్య గద్దె అనురాధకు చెందిన బంధువుది కావడంతో పచ్చ గద్దలు రంగంలోకి దిగాయి. వాష్ రూమ్‌లలో రహస్య కెమెరాలు లేవని అధికారులతో చెప్పించే యత్నం చేశారు. విద్యార్థుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవ్వడంతో కథ అడ్డం తిరిగింది. గురువారం రాత్రి నుంచి ఈ ఘటనపై విద్యార్థులు ఆందోళన చేస్తున్నప్పటికీ విషయం బయటకు పొక్కకుండా ఆరోపణలు ఎదుర్కొంటున్న అమ్మాయి తండ్రి కీలక పాత్ర పోషించారు. అమ్మాయి తండ్రికి సైతం టీడీపీ పెద్దలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అందువల్ల ఆయన కాలేజీ యజమాన్యంపై ఒత్తిడి తెచ్చి, సీసీ కెమెరాల విషయాన్ని పక్క దారి పట్టించే యత్నం చేశారు. ఓ దశలో తన కూతురి జోలికి వస్తే కాలేజీ పరువు తీస్తానని హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో కాలేజ యజమాన్యం.. విద్యార్థిని తండ్రితో కుమ్మక్కు అయ్యింది. టీడీపీ నేతలు, అధికారులు కాలేజీ వద్దకు వచ్చి కేసు తీవ్రతను తగ్గించే యత్నం చేశారు.

వైఎస్ జగన్ కల సాకారం

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రారంభం

- వర్చువల్ విధానంలో మహారాష్ట్ర నుంచి ప్రధాని మోదీ శ్రీకారం
- 76.89 ఎకరాల్లో రూ.288.8 కోట్లతో నిర్మాణం
- 1,250 బోట్లు నిలుపుకునేలా హార్బర్ అభివృద్ధి
- ఏడాదికి 40 వేల టన్నుల మత్స్య సంపద వెలికితీసే అవకాశం
- రూ.392.58 కోట్లతో నిర్మిస్తున్న పూడిమడక హార్బర్‌కూ శంకుస్థాపన
- రాష్ట్రంలో మత్స్యకారుల కష్టాలను తీర్చడానికి రూ.3,500 కోట్లతో 10 హార్బర్ల నిర్మాణం చేపట్టిన జగన్ సర్కార్
- తొలిదశలో జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ హార్బర్ల నిర్మాణం
- ఎన్నికల కోడ్ రావడంతో జువ్వలదిన్నె ప్రారంభం వాయిదా



సాక్షి, అమరావతి/నెల్లూరు (దగ్గుమిట్ట) : ఏపీలోని 555 మత్స్యకార గ్రామాల్లో 6.8 లక్షల మంది మత్స్యకారులకు ప్రయోజనం చేకూర్చే విధంగా సుమారు రూ.3,500 కోట్లతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిన పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ హ్యాండ్లింగ్ సెంటర్లలోని మొట్టమొదటిదైన జువ్వలదిన్నె హార్బర్ మత్స్యకారులకు అందుబాటులోకి వచ్చింది. నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో రూ.288.8 కోట్ల వ్యయంతో 76.89 ఎకరాల్లో అభివృద్ధి చేసిన ఈ హార్బర్‌ను ప్రధాని నరేంద్ర మోదీ మహారాష్ట్ర పాలఘర్ నుంచి శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతో.. ఇప్పటివరకూ పొట్టకూటి కోసం కూలీలుగా పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లిన వారు ఇప్పుడు ఇక్కడే అధునాతన మెకనైజ్డ్ బోట్లతో చేపలు పట్టుకునే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది. ఈ హార్బర్ ప్రారంభంతోపాటు అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద రూ.392.58 కోట్లతో అభివృద్ధి చేయనున్న ఫిషింగ్ హార్బరుకూ ప్రధాని వర్చువల్‌గానే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్ నెల్లూరు కలెక్టరేట్ నుంచి.. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఏపీ మారిటైమ్ బోర్డు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులూ అనకాపల్లి నుంచి పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌తో వాయిదా..

ఇక రాష్ట్రంలో మొత్తం పది ఫిషింగ్ హార్బర్లలో తొలి దశలో జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ హార్బర్ల నిర్మాణాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టింది. ఇందులో తొలుత జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పూర్తికాగా గత ప్రభుత్వ హయాంలో దీన్ని వర్చువల్‌గా అప్పటి సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభించడానికి అధికారులు ప్రయత్నించారు. కానీ, ఇటువంటి ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టును నేరుగా మత్స్యకారులతో కలిసి ప్రారంభిస్తానంటూ ఆయన వాయిదా వేశారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రారంభ కార్యక్రమం వాయిదా పడింది. ఇప్పుడు ప్రధాని 13 రాష్ట్రాలకు చెందిన రూ.1,200 కోట్ల విలువైన 217 మత్యకార ప్రాజెక్టులను శుక్రవారం ప్రారంభించగా ఇందులో 'జువ్వలదిన్నె' ఒకటి.

25వేల కుటుంబాలకు లబ్ధి..

ప్రధాని ప్రారంభించిన జువ్వలదిన్నె ప్రాజెక్టు ద్వారా 25,000 మత్యకార కుటుంబాలు ప్రయోజనం పొందనున్నాయి. 1,250 మోటరైజ్డ్, మెకనైజ్డ్ బోట్లు నిలుపుకునేలా ఈ హార్బరును అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దారు. ఈ హర్బర్ ద్వారా ఏటా 41,250 టన్నుల మత్స్య సంపద అదనంగా అందుబాటులోకి రానుంది. హార్బర్‌లోనే కోల్డ్‌చైన్, ఐస్‌ప్లాంటు, చిల్‌రూం వంటి మౌలిక వసతులతో పాటు బోట్ రిపేర్ వర్క్‌షాపులు, గేర్‌షెడ్లు, నెట్ మెండింగ్ షెడ్లు వంటి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. అలాగే, నిర్మాణ పనులు ప్రారంభించిన పూడిమడక హార్బరు ద్వారా 980 బోట్లు నిలుపుకునే వెసులుబాటుతో పాటు 4,870 మంది మత్స్యకార కుటుంబాలు లబ్ధిపొందనున్నాయి. మరోవైపు.. రాష్ట్రంలో తలపెట్టిన పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్‌ల్యాండ్ సెంటర్లు పూర్తిగా అందుబాటులోకి వస్తే మొత్తం 6.8 లక్షల మంది మత్యకారులు లబ్ధిపొందనున్నారు. వీటి ద్వారా 10,521 మెకనైజ్డ్ బోట్లు నిలుపుకునే సామర్థ్యంతో పాటు 4.5 లక్షల టన్నుల అదనపు మత్స్య సంపద సమకూరనుంది. తద్వారా రాష్ట్ర జీడీపీకి రూ.9,000 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా.

జిల్లా వార్తలు

అర్హత కలిగిన ప్రతీ రైతుకు రుణం


రుణ మంజూరు పత్రాలు అందిస్తున్న డీసీసీబీ చైర్మన్

నేలకొండపల్లి: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పరిధిలో అర్హత కలిగిన ప్రతీ రైతుకు కొత్తగా రుణాలు అందించనున్నట్లు చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని పైనంపల్లి సొసైటీ పరిధిలోని రైతులకు శుక్రవారం ఆయన రుణ మంజూరు పత్రాలను అందించి మాట్లాడారు. పైనంపల్లి సొసైటీ పరిధిలో 400 మంది రైతులకు గాను రూ.2 కోట్ల మేర రుణాలు మాఫీ కాగా, కొత్తగా రుణాలు ఇస్తున్నామని తెలిపారు. నేలకొండపల్లి బ్రాంచ్ మేనేజర్ ఇందు, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, ఫీల్డ్ ఆఫీసర్ నాగప్రసాద్, సొసైటీ ఉపాధ్యక్షుడు కలకుంట్ల శ్రీనివాసరావుతో పాటు ఉసిరికాయల లక్ష్మయ్య, చల్లగుండ్ల వెంకట్రామయ్య, చిట్టా భాస్కర్‌రెడ్డి, కుక్కల సామేలు, గండు శ్రీను, వేనేపల్లి నాగేశ్వరరావు, సీఈఓ జగదీశ్ పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జిగా రామారావుకు పదోన్నతి

కొత్తగూడెంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టులో జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న బత్తుల రామారావుకు సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి లభించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. తొలుత జూనియర్ సివిల్ జడ్జిగా ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్‌లో ఐదేళ్ల పాటు పనిచేసిన ఆయన కొత్తగూడెం కోర్టుకు 2021 అక్టోబర్‌లో బదిలీపై వచ్చారు. ప్రస్తుతం రామారావు సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి సాధించడంపై బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణతో పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

ఖమ్మం మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

ఖమ్మంవ్యవసాయం: వారాంతపు సెలవులు, అమావాస్య సందర్భంగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా మూడు రోజులు సెలవులు వచ్చాయి. ఈ నెల 31న శనివారం, సెప్టెంబర్ 1న ఆదివారం వారాంతపు సెలవులు కాగా.. 2వ తేదీన అమావాస్య సందర్భంగా సెలవు ప్రకటించినట్లు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, వ్యాపారులు, గుమస్తాలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. తిరిగి 3వ తేదీ మంగళవారం నుంచి పంట ఉత్పత్తుల కొనుగోళ్లు మొదలవుతాయని ఆయన తెలిపారు.

పెద్దమ్మ తల్లీ.. ఎన్నాళ్లీ కష్టాలు?


గుడి సమీపాన ఫంక్షన్ హాల్ వద్ద రోడ్డుపైనే పార్కింగ్

- ఆలయం వద్ద పార్కింగ్ పరేషాన్
- వేలాది మంది భక్తులకు ఇక్కట్లు
- సరైన ఏర్పాట్లు లేక ఎక్కడికక్కడే వాహనాల నిలిపివేత
- ఫలితంగా సాధారణ పౌరులతో పాటు భక్తుల అవస్థలు


ఆలయం ఎదుట వాహనాల రద్దీ

పాల్వంచరూరల్: ఉమ్మడి ఖమ్మంలోనే పేరెన్నిక కలిగిన పాల్వంచ మండలం కేశవాపురం–జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయం వద్ద పార్కింగ్ సమస్య భక్తులను వేధిస్తోంది. ఆలయం భద్రాచలం జాతీయ రహదారి పక్కనే ఉండడానికి తోడు పార్కింగ్‌కు సరైన ఏర్పాట్లు లేకపోవడం సమస్యకు కారణమవుతోంది. దీంతో తరచూ ట్రాఫిక్ ఇక్కట్లు ఎదురవుతుండగా.. అప్పుడప్పుడూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.

పార్కింగ్ సౌకర్యం ఎక్కడ?

భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని దర్శించుకున్న భక్తులు తిరుగు ప్రయాణంలో లేదా వెళ్లే ముందో తప్పనిసరిగా పెద్దమ్మతల్లి దర్శనం చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీనికితోడు మొక్కులు చెల్లించడానికి వచ్చే భక్తులు పిల్లల తలనీలాలు, ఇతర వేడుకలు జరిపేందుకు ఉమ్మడి జిల్లా నుంచే కాక రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. ఎక్కువ భక్తులు సొంత లేదా అద్దెవాహనాల్లో వస్తారు. కానీ, వాహనాలకు పార్కింగ్ సౌకర్యం లేక జాతీయ రహదారి పక్కనే అడ్డదిడ్డంగా నిలిపేస్తున్నారు. దీనికి తోడు పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ పేరిట గుడి ఎదురుగానే బారికేడ్లు పెట్టారు. ఇలా రకరకాల కారణాలతో ఉదయం నుంచి రాత్రి వరకు పలుమార్లు వాహనాల రాకపోకలకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి.

రోడ్డు దాటాల్సిందే..

ఫంక్షన్ హాళ్లకు వెళ్లాలన్నా.. పూజా సామగ్రి కొనుగోలు కోసం దుకాణాలకు వెళ్లాలన్నా భక్తులు రోడ్డు దాటక తప్పడం లేదు. అయితే, ఇటు భద్రాచలం వైపు, అటు పాల్వంచ వైపు వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో రోడ్డు దాటే సమయాన మహిళలు, వృద్ధులు, చిన్నారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. గతంలో రోడ్డు దాటుతున్న పలువురు గాయాలకు గురైన సందర్భాలు ఉన్నా ఎవరికీ పట్టడం లేదు.

పార్కింగ్ స్థలం ఏర్పాటైతేనే..

ఆలయ అధికారులు, పోలీసులు సమన్వయంతో వ్యవహరించి ఆలయ పరిసరాల్లో వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిన అవసరముంది. ఆలయం చుట్టూ ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లు పెద్దసంఖ్యలో ఉన్నాయి. ఇందులో ఎక్కడ కూడా పార్కింగ్ స్థలం లేకపోవడంతో ఫంక్షన్లు నిర్వహించే భక్తులు వాహనాలను రోడ్డుపైనే నిలిపివేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ జామ్ అయి మిగతా వారు అవస్థ పడటం ఆనవాయితీగా మారింది. ప్రధానంగా ఆదివారం, శుక్రవారాల్లో వేలాదిగా భక్తులు వస్తుండటంతో సమస్య మరింత ఎక్కువవుతోంది. ఈ మేరకు అధికారులు స్పందించి పెద్దమ్మతల్లి ఆలయం ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఫంక్షన్ హాళ్ల వద్ద పార్కింగ్ ఏర్పాట్లు



రద్దీ రోజుల్లో అదనపు సిబ్బందిని కేటాయించి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ఫంక్షన్ హాళ్ల వద్ద ఇష్టారీతిన వాహనాలు నిలపడంతో సమస్య వస్తోంది. ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేసేలా సూచనలు ఇస్తాం. –బి.సురేశ్, ఎస్‌ఐ, పాల్వంచరూరల్

ప్రత్యేక స్థలాలు కేటాయించాలి



వాహనాల పార్కింగ్‌కు స్థలం లేక గుడి మొదలు కేశవాపురం వరకు రోడ్డు వెంటే నిలుపుతున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. అధికారులు స్పందించి పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయిస్తేనే సమస్య పరిష్కారమవుతుంది.

–భరత్, భక్తుడు

రోడ్డు దాటాలంటే భయమేస్తోంది..



ఆలయం వద్ద రోడ్డు పొడవునా వాహనాలు నిలుపుతున్నారు. దీంతో భక్తులు గుడిలోకి వెళ్లివచ్చే సమయాన రోడ్డు దాటాలంటే భయపడుతున్నారు. గుడి వద్ద వాహనాల క్రమబద్ధీకరణపై దృష్టి సారించి పార్కింగ్‌కు ఏర్పాట్లుచేయాలి.

–నరేశ్, కేశవాపురం

రామారావుకు రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డు



ఖమ్మం జిల్లా రఘునాథపల్లి మండలం కోయచలకకు చెందిన చెరుకూరి రామారావు రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డుకు ఎంపికయ్యాడు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా ఓ రైతుకు అవార్డు ఇస్తున్నారు. ఈ ఏడాది అవార్డుకు రామారావు ఎంపిక కాగా, ఆయనకు వైరా కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు సమాచారం ఇచ్చారు. వచ్చే నెల 3వ తేదీన హైదరాబాద్‌లో జరిగే యూనివర్సిటీ వార్షికోత్సవ వేడుకల్లో అవార్డు స్వీకరించనున్న ఆయనను పలువురు అభినందించారు. – రఘునాథపాలెం

పేరుకే ఏరియా ఆస్పత్రి..


మణుగూరులోని సింగరేణి ఏరియా ఆస్పత్రి (ఇన్‌సెట్) ఓపీ గది వద్ద వేచి ఉన్న కార్మికుల కుటుంబీకులు

- పీహెచ్‌సీ స్థాయిలోనూ అందని వైద్యం
- మణుగూరు సింగరేణి ఆస్పత్రిలో వైద్యుల కొరత
- కనీస సేవలకు సైతం 'రెఫర్'పైనే ఆధారం
- ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి నష్టపోతున్న కార్మికులు

మణుగూరుటౌన్: సింగరేణి సంస్థ మణుగూరు ఏరియా పరిధిలోని ఆస్పత్రిలో వైద్యుల కొరత వేధిస్తోంది. బదిలీపై వెళ్లిపోయిన వారి స్థానంలో కొత్త వైద్యులను నియమించడంలో ఆలస్యం.. సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యాన ఉన్న వైద్యులను ఇతర ప్రాంతాలకు డిప్యూటేషన్‌పై పంపిస్తుండటంతో ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో కూడా వైద్యం అందని పరిస్థితులు నెలకొన్నాయి. ఇద్దరి నుంచి ముగ్గురు వైద్యులు మాత్రమే అత్తెసరు వైద్యంతో సరిపెడుతూ మిగతా సేవలకు రిఫర్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఫలితంగా వార్షిక లక్ష్యాల సాధనలో అగ్రగామిగా నిలుస్తున్న మణుగూరు ఏరియాలో కార్మికులకు మెరుగైన వైద్యం అందక ప్రైవేట్ వైద్యశాలలను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు.

అసలే కొరత.. ఆపై డిప్యూటేషన్

మణుగూరు ఏరియాలోని 2,300 మంది కార్మికులు, వారి కుటుంబ సభ్యులే కాక 1,500 మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరితో పాటు రిటైర్డ్ అయిన కార్మిక కుటుంబాలకు సైతం ఇక్కడి సింగరేణి ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలందించాలి. ఆస్పత్రి స్థాయి ఆధారంగా 11 మంది వైద్యులు ఉండాల్సి ఉన్నా.. ఎనిమిది మంది రెగ్యులర్, ఇద్దరు కాంట్రాక్ట్ వైద్యులున్నారు. ఇందులో ఒకరు బదిలీపై వెళ్లగా, ఇంకొకరి అగ్రిమెంట్ పూర్తయింది. మరో వైద్యురాలు రాజీనామా చేయడమే కాక అనస్థీషియన్ సెలవులో ఉండడంతో గైనిక్, సర్జన్ అత్యవసర సేవలన్నీ రిఫర్ చేస్తున్నారు. అంతేకాక వైద్యుల కొరతతో నెలలో 10 నుంచి 15 రోజుల పాటు సర్జన్‌తో పాటు జనరల్ ఫిజీషియన్లు ముగ్గురిని కొత్తగూడెం, భూపాలపల్లి ఆస్పత్రులకు డిప్యూటేషన్‌పై పంపుతున్నట్లు తెలుస్తోంది. ఇక మణుగూరు సింగరేణి ఏరియా ప్రభావిత గ్రామాల్లో వైద్యశిబిరాల ఏర్పాటు, పీఎంఈలో సేవలకు వెళ్లే వైద్యులు మినహాయిస్తే రోజూ 450 పైచిలుకు ఓపీతో పాటు ఇన్‌పేషంట్ 25 – 35 మందికి ఇద్దరు వైద్యులే సేవలందించాల్సి వస్తోంది. ఈ కారణంగా గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తోందని కార్మిక కుటుంబాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి.

నామమాత్రపు సేవలే..

ఖాళీల భర్తీ విషయం మరిచిన యాజమాన్యం దృష్టికి అత్యవసర సమయాల్లో కార్మికులకు మెరుగైన వైద్యం అందడం లేదని చెప్పినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ప్రసవాల సమయంలో కీలకపాత్ర పోషించే అనస్థీషియన్, పీడియాట్రీషియన్ నియామకంలో నిర్లక్ష్యం చేస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఇక ఆర్థో సర్జన్ లేని కారణంగా గనుల్లో ప్రమాదాలు జరిగినప్పుడు సత్వర వైద్యం అందడం లేదు. తొలుత ప్రైవేట్ ఆస్పత్రులకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించాక కొత్తగూడెం తరలిస్తున్నారని.. ఆలోగా నష్టతీవ్రత పెరుగుతోందని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా వార్షిక లక్ష్యాల సాధనలో ముందు వరుసలో నిలుస్తున్న మణుగూరు ఏరియాలోని ఆస్పత్రిలో సరిపడా వైద్యులను నియమించి మెరుగైన వైద్యం అందేలా పర్యవేక్షించాలని కోరుతున్నారు.

సంక్షేమం విషయంలో నిర్లక్ష్యం



లక్ష్యసాధనకు తరచూ సూచనలు చేసే యాజమాన్యం కార్మికుల సంక్షేమంపై మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఏరియా ఆస్పత్రిలో వైద్యులు లేక ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తే జేబులు గుల్ల చేసుకోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా యజమాన్యం, అధికారులు దృష్టి సారించాలి. – వై.రాంగోపాల్, ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు

వైద్యం అందించడంలో విఫలం



ఆస్పత్రిలో వైద్యనిపుణుల కొరత ఉండగా.. బదిలీ అయిన వారి స్థానంలో కొత్త వారు రాలేదు. వైద్యులు అరకొరగా ఉండడంతో సింగరేణి ఆస్పత్రికి రావాలంటేనే కార్మికులు భయపడాల్సి వస్తోంది. సీఎండీ దృష్టి సారించి మణుగూరు ఆస్పత్రిలో సమస్యలను పరిష్కరించాలి.

– వత్సవాయి కృష్ణంరాజు, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు